క్లుప్తంగా

అర్థమయ్యే రీతిలో బోధన

- ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విమలారాణి


నరవ అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ విమలారాణి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అర్థమయ్యేరీతిలో బోధించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.విమలారాణి అన్నారు. మండలంలోని నరవలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. కిచెన్ గార్డెన్‌లో ఆకుకూరలు, కూరగాయ మొక్కలను పెంచి, మెనూలో వినియోగించాలని సూచించారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి. అనురాధ పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ


దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు విమలమ్మ, చక్రపాణి, తదితరులు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఎంఈఓ విమలమ్మ గురువారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో చేరి విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ – 2 చక్రపాణి ఐఈఆర్‌టీలు శ్రీనివాసరావు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

బాధ్యతతో విధులు నిర్వహించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహిస్తూ, సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని నీలకంఠరాజపురం సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ఈ సర్వీసులు, రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో సమస్యలపై ఆరా తీశారు. పెండింగ్ పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


ట్రిపుల్ ఐటీకి ఎంపికైన జ్యోతిబాపులే ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో గల జ్యోతిబాపూలే ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల ట్రిపుల్ ఐటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి గేదెల పూజిత, కె.చైత్రిశ్రీ, పి.లీలచైతన్య, పి.సృజన, పి.భార్గవి, ఎన్.గిరిజ ఎంపికయ్యారని పేర్కొన్నారు. అలాగే శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఓ.కావ్య, కె.వేణు, ఎస్.లిఖిత.. ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీకి డి.బాలచంద్రిక ఎంపికయ్యారన్నారు. అలాగే లక్కవరపుకోట, కొట్యాడ, చందులూరు, ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు.

నోట్ పుస్తకాల వితరణ


నోట్ పుస్తకాలు అందజేస్తున్న డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ కిరణ్

వేపాడ: మండల కేంద్రానికి చెందిన డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ జీబీ రవికిరణ్ తన తండ్రి జ్ఞాపకార్థం మారిక ప్రాథమిక పాఠశాల గిరిజన విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక వాసవీక్లబ్ సీనియర్ సభ్యుడు దుద్దు శ్రీనివాసరావు 50 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తాడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోజంతా వర్షమే..

- నిండుతున్న చెరువులు
- వరినారు పోతకు అవకాశం కుదిరేనా..!


ఎస్.కోటలో కురుస్తున్న వర్షం

శృంగవరపుకోట: ముందస్తు వానలు ముంచెత్తుతున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పల్లెలు, పట్టణాలు తడిసి ముద్దయ్యాయి. రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. ఇబ్బడి ముబ్బడిగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే పలు చెరువుల్లో నీరు చేరింది. కాగా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సంప్రదాయబద్ధంగా వరినారు పోసేందుకు అనువైన పరిస్థితులు లేకుండా పోయాయి. వారం రోజులుగా వర్షాలు కురవడం.. ఎండ లేకపోవడంతో ఆకుమడులు దున్నుకునే అవకాశం లేకుండా పోయింది. సిద్ధం చేసుకున్న వరినారు మడుల్లో నీరు చేరిపోయి అదునుకు ఆకు పోసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆరుద్ర కార్తె ప్రవేశించడం, వర్షాలు ఎడాపెడా కురుస్తుండడంతో వరినారు పోసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. నారుమడిలో విత్తనాలు జల్లి చేతులతో పిసికేసి ఆకు పోయాలని కొందరు.. నారుమడులు దమ్ము పట్టి వరినారు పోయాలని కొందరు చూస్తున్నారు. నీరు ఎక్కువగా ఉన్న పల్లపు ప్రాంతాల్లో దమ్ము పట్టి వెదలు చల్లాలనే ఆలోచనలో మరికొందరు ఉన్నారు. ఎస్.కోట డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతానికి దగ్గరగానే వర్షాలు కురిశాయి. ఈ నెలాఖరులోగా మరింత వర్షం కురుస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. రెండు రోజులుగా రోజంతా వర్షం కురియడంతో ఎస్.కోట, కొత్తవలస, జామి వంటి వ్యాపార కేంద్రాల్లో ఫుట్‌పాత్ వ్యాపారులు, హోటళ్లు, కూరగాయల వ్యాపారులు సరైన గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

డివిజన్‌లో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి

మండలం	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం
శృంగవరపుకోట	188.7మి.మి	93.5మి.మీ
వేపాడ	95.7	93.9
లక్కవరపుకోట	89.1	78.6
కొత్తవలస	106.6	80.0
జామి	97.9	92.2

భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న రాందేవ్‌బాబా

కొత్తవలస: మండలంలోని చిన్నరావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పతంజలి ఫుడ్ ప్రాసెసింగ్‌కు గతంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కేటాయించిన 172 ఎకరాల భూమిని ప్రముఖ యోగా గురువు, పతంజలి గ్రూప్ అధినేత బాబా రాందేవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017 సంవత్సరంలో పతంజలి ఫుడ్ ప్రాసెస్ యూనిట్ స్థాపనకు 172 ఎకరాలను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కేటాయించిదని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే త్వరలో పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే భూసేకరణ సమయంలో సుమారు 23 ఎకరాలకు పరిహారం ఇవ్వలేదని స్థానికులు పరిశ్రమ సీఈఓ సురేంద్రకుమార్‌శర్మకు సర్పంచ్ బూసాల దేముడు ఆధ్వర్యంలో వివరించారు. దీంతో ఆయన స్పందిస్తూ పరిహారం అందని వారు పూర్తి ఆధారాలతో విశాఖపట్నంలో గల పతంజలి కార్యాలయానికి రావాలని సూచించారు.

ఏపీ రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా "దన్నాన"



చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో అనుబంధ విభాగాల కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురుకు అవకాశం లభించింది. అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా మండంలోని పత్తికాయవలసకు చెందిన దన్నాన జనార్ధనరావును నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తాజాగా రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన దన్నాన జనార్ధనరావు గత ప్రభుత్వంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. ఆయన భార్య పద్మావతి పత్తికాయవలస సర్పంచ్‌గా పని చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ పదవి కోసం తన పేరును ప్రతిపాదించిన శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీపీ


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మీసాల విజయలక్ష్మి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని రేగటి పంచాయతీ పరిధి నీలాద్రిపురం గ్రామంలోని శ్మశాన వాటికలో మండల పరిషత్ నిధులు రూ.2.95లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికలో ఎలాంటి సమస్యలు ఉండకూడదనే ఆలోచనతో మౌలిక వసతులను కల్పించటం కోసం మండల పరిషత్ నుంచి నిధులను మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో బోరు నిర్మాణం చేపట్టి ట్యాంకును ఏర్పాటు చేసి నీటి సౌకార్యం కల్పించామని, గ్రామస్తులంతా ఈ సౌకర్యాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ కదుమల రాంబాబు, మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు, గ్రామ పెద్దలు మజ్జి రాజినాయుడు, అలమండ తవిటినాయుడు, స్వామినాయుడు, అగురు తవుడు, పెద్దిరాజు, గౌరీశంకర్, కృష్ణారావు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి


మధ్యాహ్న భోజన పథకం పరిశీలిస్తున్న అధికారుల బృందం

చీపురుపల్లి: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సీహెచ్ జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గురువారం మండలంలోని సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించింది. అక్కడి పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌తో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని సందర్శించారు. ఆరేడు తరగతుల విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ పి.సత్యారావు, ఏసీఎంవో కె.రామారావు, ఎంఈవో ఎం.బూసినాయుడు, పాఠశాల హెచ్‌ఎం డి.ఉమామహేశ్వరి, సీఆర్‌ఎంటీలు కె.రామకృష్ణ, పి.వినోద్, ఎన్‌సీసీ ఆఫీసర్ మామిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరం..


కొత్తవలస : మూడు రోడ్లు జంక్షలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి విజయచంద్ర, తదితరులు


గజపతినగరం రూరల్ అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

నేటి తరం యువత మత్తుకు దూరంగా ఉండాలని గజపతినగరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్‌రాజ్‌కుమార్, కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సముద్రాల విజయచంద్ర సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గజపతినగరం, కొత్తవలసలో అవగాహన సదస్సులు నిర్వహించారు. మత్తు పదార్థాల జోలికెళితే జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. వాడవాడలా అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు జరిగాయి. –గజపతినగరం రూరల్/కొత్తవలస

డయేరియా కేసుల నమోదు

గుర్ల: మండలంలోని చింతలపేటలో ఇద్దరు, వల్లాపురంలో ఒకరు డయేరియా బారిన పడ్డారు. వీరు నెల్లిమర్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. వల్లాపురం గ్రామానికి చెందిన బొనేల అప్పయ్యమ్మ, చింతలపేటలో డయేరియా బారిన పడిన ఇద్దరు కొలుకుంటున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ గురువారం తెలిపారు. డయేరియా కేసుల నమోదు అవుతున్నట్టు గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారికి సమాచారం ఇవ్వకపోవడంతో స్థానిక ఏఎన్ఎంలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీడీవో బాధ్యతల నుంచి తప్పించాలి


ఎంపీడీవో శేషుబాబుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గుర్ల: సచివాలయం డీడీవో బాధ్యతల నుంచి తమను తప్పించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శేషుబాబుకు గురువారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులను వారి విధులకు మాత్రమే పరిమితం చేయాలని, జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేలు అన్ని సచివాలయం సిబ్బంది అందరు చేసే విధంగా స్పష్టమైనా ఆదేశాలు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పంచాయతీ కార్యదర్శులు సాయి గణేష్, రామకృష్ణ, దివాకర్, బాలకృష్ణ, లక్ష్మి, ఉమ ఉన్నారు.

ఆర్‌టీఐ వింగ్ కార్యదర్శిగా మధుసూదనరావు



గుర్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ కార్యదర్శిగా గుర్ల మండలంలోని కోండగండ్రేడుకు చెందిన కెంగువ మధుసూధనరావును వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ప్రకటన వెలువడింది. తనను రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ కార్యదర్శిగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, శాసన మండలి విపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనువాసరావుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

80 మందికి నేత్ర పరీక్షలు


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రమేష్‌కుమార్

దత్తిరాజేరు: మండలంలోని టి. భూర్జవలసలో విజయనగరం వెంకటరామ ఆస్పత్రి వైద్యులు గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించి, 80 మంది రోగులను పరీక్షించారు. ఇందులో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ రమేష్‌కుమార్ తెలిపారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేసి తిరిగి ఇంటికి పంపిస్తారని ఎంపీటీసీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరి ఫీడర్‌లో కొత్త బే ఎక్స్‌టెన్షన్ పనులు చేపడుతున్నందున ఎస్.కోట పట్టణ పరిధిలో పందిరప్పన్న జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్, దేవీ జంక్షన్, పుణ్యగిరి రోడ్డు, బర్మాకాలనీ, ఆఫీషియల్ కాలనీ, టీచర్స్ కాలనీ, శ్రీనివాస కాలనీ, నడబంద, చైతన్య కాలేజి లైన్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అణచివేతకు దిగడం అన్యాయం

- ఏపీ రైతు సంఘ నాయకుడు జగన్


నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడుతున్న రైతుసంఘం నేత జగన్

శృంగవరపుకోట: ఆపన్నుల ఆకలి కేకలు వినపడడం లేదా?.. పుడమి పుత్రులకు జరిగిన అన్యాయం కనబడడం లేదా?.. నిస్సిగ్గుగా పోలీసుల అండతో నిర్వాసితుల పోరాటాన్ని అణచివేయాలని చేస్తున్న ప్రయత్నాలకు సిగ్గుగా లేదా ?.. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమా..నిరంకుశ రాజ్యమా అని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మండిపడ్డారు. జిందాల్ నిర్వాసిత రైతుల శిబిరాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిందాల్ చేసిన ఒప్పందాలకు ఎవరు బాధ్యత వహిస్తారంటే సమాధానం ఇవ్వడం లేదన్నారు. తీరా కంపెనీల ఏర్పాటుకు నిర్వాసితులు వ్యతిరేకమని విష్రప్రచారం చేస్తున్నారన్నారు. రైతులు కంపెనీలకు వ్యతిరేకమైతే జిందాల్ తీసుకున్న భూములు ఎవరిచ్చారని ప్రశ్నించారు. జిందాల్ కంపెనీ కోసం స్థలాలు ఇచ్చిన వారికి 2013 చట్టం ప్రకారం తిరిగి భూములు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ఎంఈ పార్క్ కోసం స్థలం కావాలంటే ప్రస్తుత మార్కెట్ ధర చెల్లించి భూసేకరణ చేపట్టాలన్నారు. పోలీసులు, జిల్లా అధికారులు వేధింపులకు దిగితే ఉద్యమం రూపు మారడం ఖాయమని, సమస్యను అర్థం చేసుకుని నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కొత్తవలస రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక టికెట్ తనిఖీ డ్రైవ్


కొత్తవలస రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రత్యేక బృందం

కొత్తవలస: ప్రయాణికులకు భద్రత, సౌకర్యాన్ని పెంపొందించేందుకు కొనసాగుతున్న ప్రయత్నాల్లో భాగంగా వాల్తేరు డివిజన్ కొత్తవలస రైల్వేస్టేషన్ పరిధిలో ప్రత్యేక టికెట్ చెకింగ్ డ్రైవ్‌ను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టికెట్ లేని ప్రయాణాన్ని నిరోధించడమే లక్ష్యంగా తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులను తనిఖీ చేయగా.. 2,030 మంది టికెట్ లేకుండా ప్రయాణించారని, వీరి వద్ద నుంచి మొదటి రోజే రూ.12 లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు టికెట్ కలెక్టర్లు, ఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పర్యాయాలు నట్టల నివారణ మందు


గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఎ.డి చలపతిరావు పక్కనే వేపాడ పశువైద్యాధికారి గాయత్రి

వేపాడ: ఏడాదిలో నాలుగు పర్యాయాలు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేయనున్నట్లు శృంగవరపుకోట పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.చలపతిరావు తెలిపారు. మండలంలోని దబ్బిరాజుపేటలో మొదట విడత నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడత జూన్ 26 నుంచి జూలై 10 వరకు కొనసాగిస్తామన్నారు. మండలంలో 15,000 గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు. గొర్రెల కాపర్లు విధిగా మూగజీవాలకు నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు. మొదటి రోజు సుమారు రెండు వేల జీవాలకు మందు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి స్థలం కేటాయించండి

- ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేసిన దళిత నేతలు


స్థలం కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయికులు

లక్కవరపుకోట: నియోజకవర్గ కేంద్రమైన శృంగవరపుకోటలో అంబేడ్కర్ విజ్ఞాన భవనానికి స్థలం కేటాయించాలని దళిత ఉద్యమనేత అతవ ఉదయభాస్కర్, తదితరులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి ఆమె స్వగృహంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి, ఎస్.కోట మండలాల్లో దళితులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. దళిత అభ్యున్నతికి పెద్దపీట వేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎస్.కోటలో అంబేడ్కర్ విజ్ఞాన భవనానికి కనీసం ఐదు సెంట్ల భూమిని కేటాయించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే లలితకుమారి స్పందిస్తూ.. తక్షణమే స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ఎస్.కోట తహసీల్దార్‌ను ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పేడ సూరి దేముడు, పత్రి అప్పారావు, బోనెల ఈశ్వరరావు, కొట్యాడ అప్పారావు, ఎద్దు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

- ఏఓ కిరణ్‌కుమార్


విత్తనాల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ పి.కిరణ్‌కుమార్

గజపతినగరం: విత్తనాల్లో నాణ్యత లేకపోతే డీలర్లపై చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న విత్తన దుకాణాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దుకాణాల్లో విత్తన నమూనాలు సేకరించి, పరీక్షకు తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. మండలానికి 26 విత్తన నమూనాలు లక్ష్యం కాగా.. ఇంతవరకు 20 నమూనాలు తీసి పంపించామని చెప్పారు. పరీక్షలో మొలక శాతం, తేమశాతం సరిగ్గా లేకపోతే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సందర్శన


విద్యార్థులకు బోధిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని వల్లంపూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా 4, 5 తరగతులకు సంసిద్ధత పాఠాలపై బోధించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం భవిత కేంద్రాన్ని పరిశీలించారు.

నట్టల వ్యాధి నివారణకు వ్యాక్సిన్


గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు వేస్తున్న అధికారులు

చీపురుపల్లి: గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణ కోసం ఉచితంగా వ్యాక్సిన్‌లు వేయడం జరుగుతోందని పశు సంవర్ధక శాఖ ఏడీ డా.సీహెచ్.సుబ్రమణ్యం చెప్పారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నట్టల నివారణ కార్యక్రమాన్ని గురువారం మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేట గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 26 నుంచి జూలై 10 వరకు నట్టల నివారణ వ్యాక్సిన్లు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మేకలు, గొర్రెలు పెంపకందారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 300 గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు తదితరులు ఉన్నారు.

స్టేట్ బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా యడ్ల



చీపురుపల్లి రూరల్(గరివిడి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా గరివిడి మండలం తాటిగూడ గ్రామానికి చెందిన యడ్ల అప్పారావును నియామకం చేశారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. యడ్ల అప్పారావు 2005 నుంచి తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నారు. తనపై నమ్మకం ఉంచి స్టేట్ బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించటం పట్ల శాసన మండల ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.